క్లుప్తంగా

ఢిల్లీ ధర్నాలో జిల్లా నేతలు



ఢిల్లీలో ధర్నా సందర్భంగా పార్టీ అధ్యక్షుడు జగన్‌ను కలిసిన మాజీ ఎంపీ వంగా గీత

కాకినాడ: తెలుగుదేశం పార్టీ నేతలు రాష్ట్రంలో సాగిస్తున్న దాష్టీకాలకు నిరసనగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో బుధవారం తలపెట్టిన సమర శంఖానికి జిల్లా నుంచి పలువురు నేతలు తరలి వెళ్లి సంఘీభావం ప్రకటించారు. జిల్లా పార్టీ అధ్యక్షుడు కురసాల కన్నబాబు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, మాజీ ఎంపీ వంగా గీత విశ్వనాథ్, పార్టీ నాయకురాలు మాకినీడి శేషుకుమారి ధర్నాలో పాల్గొన్నారు.

గ్రామాల్లో స్వచ్ఛత వారోత్సవాలు



అమీనాబాదులో జేసీబీ సాయంతో వ్యర్థాల తొలగింపు

కొత్తపల్లి: స్వచ్ఛతా వారోత్సవాల్లో భాగంగా మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ బుధవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు. డ్రైన్లలో పేరుకుపోయిన చెత్తను పారిశుధ్య కార్మికులు తొలగించారు. ప్రధాన కూడళ్ల వద్ద పేరుకుపోయిన చెత్త, వ్యర్థాలను జేసీబీ సహాయంతో తొలగించారు. ప్రజలకు పారిశుధ్యంపై అవగాహన కల్పించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శులు, అధికారులు ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



తాగునీటి సమస్యపై కమిషనర్‌కు ఫిర్యాదు చేసిన ఎస్‌బీఐ చీఫ్ మేనేజరు

సామర్లకోట: స్థానిక పెద్దాపురం రోడ్డులో ఉన్న స్టేట్ బ్యాంకు ఆఫ్ ఇండియాకు తాగునీటి సమస్య పరిష్కరించాలని బ్యాంకు చీఫ్ మేనేజరు వీవీ సీతారామయ్య అన్నారు. ఈ మేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ జె.రామారావుకు ఆయన ఫిర్యాదు చేశారు. మున్సిపాలిటీ నుంచి వస్తున్న తాగునీరు నిలిచిపోయిందని తెలిపారు. దీని వల్ల ఖాతాదారులు ఇబ్బంది పడుతున్నారన్నారు. ఖాతాదారులను దృష్టిలో ఉంచుకొని తాగునీరు వెంటనే సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని కమిషనర్ హామీ ఇచ్చారు.

మానసిక వికాసానికి క్రీడలు దోహదం



మ్యూజికల్ చైర్స్ ఆడుతున్న విద్యార్థినులు

సామర్లకోట: మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని ఎంఈఓ-2 పి పుల్లయ్య అన్నారు. స్థానిక బచ్చుఫౌండేషన్ మున్సిపల్ హైస్కూల్‌లో నిర్వహిస్తున్న శిక్షా సప్తాహ్‌లో భాగంగా బుధవారం స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రోజులు గంట సేపైనా క్రీడలకు కేటాయించాలన్నారు. ఈ మేరకు విద్యార్థులకు కబడ్డీ, మ్యూజికల్ చైర్స్, తొక్కిడిబిళ్ల, లెమన్ ఇన్ స్పూన్, ఏడు పెంకు లాట వంటి ఆటలను ఆడించారు. హెచ్ఎం తోటకూర సాయిరామకృష్ణ అధ్యక్షత వహించగా, 10వ తరగతి విద్యార్థి కిలారి యశ్వంత్‌కుమార్ యోగాసనాలు ఎంతగానో ఆటక్టుకున్నాయి.

చెత్త రహిత గ్రామాలే లక్ష్యం కావాలి

- మున్సిపల్ ప్రత్యేకాధికారి రాధాకృష్ణ
- చెత్తను కంపోస్టు యార్డులోనే వేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాధాకృష్ణ, కమిషనర్ రామారావు

సాక్షి ఇంపాక్ట్

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలో ప్రతి ప్రాంతాన్ని చెత్త రహిత ప్రాంతాలుగా తయారు చేయాలని మున్సిపల్ ప్రత్యేకాధికారి రాధాకృష్ణ అన్నారు. డంపింగ్ యార్డుగా పిఠాపురం రోడ్డు అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు సచివాలయ పరిధిలోని శానిటరీ కార్యదర్శులకు మున్సిపల్ కమిషనర్ జాస్తి రామారావు చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేకాధికారి పాల్గొన్నారు. పట్టణంలో సేకరించిన చెత్తను కంపోస్టు యార్డులో మాత్రమే వేయాలని ఆయన ఆదేశించారు. రోడ్డు మార్జిన్‌లో చెత్త వేసినట్లు గమనిస్తే ట్రాక్టరు డ్రైవరుతో పాటు సిబ్బందిపై చర్యలు ఉంటాయన్నారు. పట్టణంలో పారిశుధ్యం సక్రమంగా లేదని కలెక్టరు షాన్ మోహన్ మంగళవారం పర్యటనలో గమనించారన్నారు. ఈ మేరకు ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టరు స్థానంలో సచివాలయ కార్యదర్శులను శానిటరీ ఇన్‌స్పెక్టర్లుగా నియమించాలని ఆదేశించినట్టు తెలిపారు. దీనిలో భాగంగా ఒకటి నుంచి 8 సచివాలయాల వరకు సీహెచ్ సాయిచరణ్, 9 నుంచి 15 సచివాలయాల వరకు రవికుమార్‌ను నియమించినట్టు ప్రత్యేకాధికారి చెప్పారు. ఆయా సచివాలయాల పరిధిలో శానిటరీ ఇన్‌స్పెక్టర్లు నిత్యం పర్యటించి కార్మికులతో పనిచేయించుకోవాలని అన్నారు. రోడ్లపై చెత్త వేసే వారికి అవగాహన కల్పించాలని, అప్పటికి వినకపోతే కమిషనర్ ద్వారా నోటీసు అందే ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రతి షాపు వద్ద డస్ట్‌బిన్లు ఉండేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుత సీజన్‌లో వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని ఏడు చెత్త ట్రాక్టర్లకు వెనుక భాగంగా కవర్లు ఏర్పాటు చేస్తామని కమిషనర్ రామారావు తెలిపారు. అదే విధంగా మరమ్మతులకు గురైన ట్రాక్టర్ల విషయాన్ని తన దృష్టికి తీసుకువస్తే వెంటనే మరమ్మతులు చేయించి వినియోగంలోనికి తీసుకువస్తామని తెలిపారు. ప్రతి ప్రదేశంలో పిన్ పాయింట్ విధానం అమలు చేయాలన్నారు. దీని వల్ల ఏ కార్మికుడు ఎక్కడ పని చేస్తున్నదీ సులభంగా గుర్తించడానికి అవకాశం ఉంటుందని చెప్పారు. పారిశుధ్య పనులల్లో మార్పులు రాకపోతే శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై చర్యలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఓ పెంకే శ్రీనివాసు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రవికుమార్, సాయి కిరణ్, సచివాలయ శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.



వీకే రాయపురం ఏలేరు కాలువలో కోతకు గురైన కాజ్‌వే

కోతకు గురైన కాజ్‌వే

- రైతుల వాహనాల రాకపోకలకు అంతరాయం

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం గ్రామంలో ఏలేరు కాలువలో నిర్మించిన కాజ్‌వే కోతకు గురైంది. గత పది రోజులుగా కురిసిన వర్షాలకు ఏలేరు కాలువ ఉధృతంగా ప్రవహించింది. ఏలేరు కాలువలో పెరిగిన గుర్రపు డెక్క నీటి ప్రవాహానికి కాజ్‌వే మీదుగా వెళ్లడంతో కాజ్‌వే కోతకు గురైంది. దాంతో రైతుల వాహనాల రాక పోకలు పూర్తిగా నిలిచిపోయాయి. వీకే రాయపురంతో పాటు, సామర్లకోట, బోయనపూడి గ్రామాలకు చెందిన సుమారు ఐదు వేల ఎకరాల పంట భూములు ఏలేరు కాలువ ఆవలి వైపు ఉన్నాయి. ఇప్పటికే వీకే రాయపురం గ్రామానికి చెందిన రైతుల పంట పోలాలు పూర్తిగా నీటిలో మునిగి పోవడంతో నీరు తగ్గిన తరువాత తిరిగి వరినాట్లు వేసుకొవడానికి రైతులు సిద్ధం అవుతున్నారు. తమ సమస్యలు దృష్టిలో ఉంచుకొని కాజ్‌వేకు వెంటనే మరమ్మతులు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘ నాయకులు కుర్రా శ్రీనివాసు, గొల్లపల్లి నానాజీ, వెలమర్తి శ్రీనివాసు, ఇంటి వెంకట్రావులు డిమాండ్ చేస్తున్నారు. మూడేళ్లలో మూడు పర్యాయాలు కాజ్‌వే కోతకు గురైందని రైతులు తెలిపారు. దీనిని దృష్టి లో ఉంచుకుని రైతుల సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యే విధంగా వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

అధిక దిగుబడిపై అవగాహన కల్పించాలి

- ఉత్తమ పద్ధతులు పాటించే రైతులకు జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్ పిలుపు



సామర్లకోట వ్యవసాయ క్షేత్రంలో స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాలు శుభ్రం చేస్తున్న జేడీ విజయకుమార్ తదితరులు

సామర్లకోట: తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి సాధించిన రైతులు లాభాలు పొందే దిశగా రైతులకు అవగాహన కల్పించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్ విజయకుమార్ అన్నారు. బుధవారం స్థానిక వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ సిబ్బందికి నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వచ్ఛత వారోత్సవాలను ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో నిర్వహించాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉండకపోతే జరిగే నష్టాలను ఆయన వివరించారు. వ్యవసాయ క్షేత్రానికి చెందిన పొలంలో కలుపు మొక్కలను తొలగించారు. వ్యవసాయ అధికారులకు పంట స్థితిపై అవగాహన ఉండాలన్నారు. పంట ఏ స్థితిలో ఏం జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసుకుని రైతులకు తెలియజేయాలన్నారు. కౌలు రైతులకు సాగుహక్కు కార్డులు అందజేసి లక్ష్యాలు పూర్తి చేసి వారికి రుణాలు అందేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీఏలు ఎం.రత్నప్రశాంతి, భాస్కరరావు, ఏఓ ఐ.సత్య తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ మృతిపై సీఐడీ విచారణ చేయాలి



వెంకట రమణారావు మృతికి సంతాపం తెలిపిన ఎంపీడీఓ తదితరులు

సామర్లకోట: నరసాపురం ఎంపీడీఓ వెంకట రమణారావు మృతిపై సీఐడీ విచారణ చేయాలని స్థానిక మండల పరిషత్ ఉద్యోగులు డిమాండ్ చేశారు. ఆయన మృతిపై బుధవారం మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపీడీఓ ఎస్‌డీ శ్యామ్ సుందర్ అధ్యక్షతన సంతాపం తెలియజేశారు. ఈ మేరకు ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి, ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ వెంకట రమణారావు మరణం ప్రభుత్వ ఉద్యోగుల మనోధైర్యంపై మాయని మచ్చలా మిగిలిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన విధి నిర్వాహణలో ఎదుర్కొన్న రాజకీయ ఒత్తిళ్లు, బెదిరింపులను స్థానిక మండల పరిషత్తు అభివృద్ధి అధికారులు ఖండించారు. ఈ మేరకు ఆయన కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ పీఆర్డీ కర్రి హరికృష్ణసత్యారెడ్డి, ఇతర అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

అణగారిన వర్గాల ఆవేదనే జాషువా కవిత్వం



జాషువా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న పీఎన్ఎం నాయకులు

పెద్దాపురం: అణగారిన వర్గాల ఆవేదనే జాషువా కవిత్వమని సాహితీ స్రవంతి జిల్లా అధ్యక్షుడు జోస్యుల కృష్ణబాబు అన్నారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో బుధవారం ప్రజా నాట్యమండలి ఆధ్వర్యంలో జాషువా వర్ధంతి సభ రొంగల వీర్రాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా కృష్ణబాబు మాట్లాడుతూ అణగారిన వర్గాల పట్ల వివక్షకు వ్యతిరేకంగా జాషువా తన కలాన్ని ఆయుధంగా మలిచిపోరాడారన్నారు. అసమానతలు లేని సమాజం కోరుకునే ప్రతి ఒక్కరికీ ఆయన కవిత్వం స్ఫూర్తినిచ్చిందన్నారు. చల్లా విశ్వనాథం మాట్లాడుతూ సమానత్వాన్ని కొరుకునే ప్రతి ఒక్కరూ ఆయన బాటలో అణగారిన వర్గాలకు అండగా కుల వివక్షకు వ్యతిరేకంగా తమ కలాలతో పోరాడేలా స్ఫూర్తి నింపారన్నారు. తొలుత ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. పీఎన్ఎం నాయకులు దారపురెడ్డి కృష్ణ, నీలం శ్రీను, దారపురెడ్డి సత్యనారాయణ, వడ్డి సత్యనారాయణ, సిరిపురపు శ్రీనివాస్. ఐద్వా నాయకులు రొంగల సుబ్బలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఓబీ నిర్మాణానికి సహకరించాలి



స్థల యజమానులతో మాట్లాడుతున్న ఆర్డీవో కిషోర్

ఆర్డీవో ఇట్ల కిషోర్

పిఠాపురం: మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పాడ సెంటర్‌లో నిర్మించతలపెట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్ఓబీ) నిర్మాణానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కాకినాడ ఆర్డీవో ఇట్ల కిషోర్ కోరారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి స్థల యజమానులతో పిఠాపురం తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం ఆయన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా అవసరాల దృష్ట్యా త్వరితగతిన ఆర్ఓబీ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఇందుకు సంబంధించి సుమారు 6 ఎకరాల భూమి అవసరం కాగా సుమారు రెండు ఎకరాల ప్రైవేటు భూమి సేకరించామన్నారు. దీనికి సంబంధించి ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నష్టపరిహారం అందజేస్తామని తెలిపారు. ఆర్ఓబీ నిర్మాణానికి స్థల యజమానులు, దుకాణదారులు సహకరించాలని కోరారు. రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం వేగవంతం చేయాలని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ ఆదేశించారని, ఈ మేరకు త్వరితగతిన నిర్మాణ పనులు ప్రారంభించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన తెలిపారు. సమావేశంలో రహదారులు, భవనాల శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఆశ్రిత, డిప్యూటీ తహసీల్దార్ రామచంద్రారెడ్డి, నాగేశ్వరరావు, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

కళ్లకు గంతలతో కార్మికుల నిరసన



కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేసిన కార్మికులు

సామర్లకోట: రాక్ సిరామిక్స్‌లో తొలగించిన కార్మికులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. స్థానిక ఏడీబీ రోడ్డులో రాక్ సిరామిక్స్‌లో పని చేస్తున్న కార్మికులను తొలగించి 100 రోజులు పూర్తి కావడంతో ఫ్యాక్టరీ యజమాన్యం మొండి వైఖరికి నిరసనగా కళ్లకు గంతలు కుట్టుకొని నిరసన తెలిపారు. ఫ్యాక్టరీలో 18 ఏళ్ల పాటు వెట్టి చాకిరి చేయించుకుని తొలగించారని, ప్రస్తుతం తమకు 40 ఏళ్ల వయస్సు దాటి పోవడంతో ఏ కంపెనీ ఉపాధి కల్పిస్తారని కార్మికులు చంద్రశేఖర్, గంగాధర్, సతీష్, రామకృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాటం ఆగదని వారు తెలిపారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల స్పందించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్మికులు వర ప్రసాద్, మల్లికార్జునరావు, శివనారాయణ, ప్రభుదాసు, చంద్రన్న, రామచంద్రయ్య, రాజబాబు, సతీష్‌కుమార్, సుబ్బారావు పాల్గొన్నారు.

రికార్డుల భద్రతలో రాజీలేదు

- తేడా వస్తే చర్యలు తప్పవు
- ఆర్డీఓ జేఎస్ రామారావు



ఆర్డీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీఓ రామారావు

పెద్దాపురం: రెవెన్యూ రికార్డుల భద్రతలో ఎటువంటి తేడాలు వచ్చిన సహించేది లేదని ఆర్డీఓ జేఎస్ రామారావు హెచ్చరించారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో ఉన్న రెవెన్యూ రికార్డులను బుధవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల పరిధిలో సంవత్సరాల వారీగా అన్ని రికార్డులకు సంబంధించిన ప్రతి ఫైల్ కార్యాలయంలో ఉండాల్సిందేనన్నారు. ఫైళ్లను భద్రపరచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ఎల్‌సీసీ, అస్సైన్‌మెంట్ ల్యాండ్, ఇళ్ల స్థలాలకు సంబంధించిన రికార్డులు మండలాల వారీగా ఉన్న డేటా డివిజన్ కేంద్రంలో ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. ప్రతి రోజూ రికార్డుల పర్యవేక్షణకు ఇద్దరు సిబ్బందితో రాత్రిపూట ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రికార్డుల భద్రతపై నిర్లక్ష్యంగా ఉన్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని కార్యాలయ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం ఆయన ఆయా గదుల్లో ఉన్న రికార్డుల భద్రతను పర్యవేక్షించి సిబ్బందికి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట కార్యాలయ డీటీ భానుకుమార్, సిబ్బంది ఉన్నారు.

'అయ్యంకి' సేవలు ఎనలేనివి



అయ్యంకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు, పాఠకులు

పెద్దాపురం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య సేవలు ఎనలేనివని పలువురు వక్తలు అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో బుధవారం అయ్యంకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ గ్రంథాలయోద్యమంలో అయ్యంకి పోరాట స్ఫూర్తి అందరికీ ఆదర్శప్రాయమన్నారు. నాటి పోరాటమే నేటి గ్రంథాలయ వ్యవస్థ పునాదికి నిదర్శనమన్నారు. తొలుత అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో చింత సాంబశివరావు, కాటంరాజు, మనోహర్, సింగం బుల్లియ్యలతో పాటు పలువురు పాఠకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొత్తపల్లి: ఉప్పాడ-పిఠాపురం రోడ్డులో బుధవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు గాయాలైనట్లు పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని ఉప్పాడ గ్రామానికి చెందిన సూరాడ శివ, ముమ్మిడి అబ్బాయి మోటర్ సైకిల్‌పై పిఠాపురం వెళుతుండగా ఉప్పాడ-పిఠాపురం రోడ్డులోని యండపల్లి జంక్షన్ సమీపంలో పిఠాపురం నుంచి ఉప్పాడ వైపు వెళుతున్న ఆటో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో శివ, అబ్బాయిలకు గాయాలు కాగా చికిత్స నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. దీనిపై ఎస్సై స్వామినాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుక్కకాట్లు వేయించుకోవాల్సిందేనా..!

- నియంత్రణలో అధికారులు విఫలం
- చట్ట ప్రకారం వాటిని అదుపు చేయాల్సిందే అంటున్న నియోజకవర్గ ప్రజలు



పెద్దాపురం మండలం చంద్రమాంపల్లి మెయిన్ రోడ్డులో కుక్కల గుంపు



సామర్లకోట మండలం వేట్లపాలెంలో పరిస్థితి ఇదీ..

పెద్దాపురం: నియోజకవర్గంలో వీధి కుక్కలు, పిచ్చి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తి పోతున్నారు. నిత్యం ఏదో ఒకచోట కుక్క కాటు కేసులు నమోదవుతూనే ఉన్నాయి. సామర్లకోట, పెద్దాపురం పట్టణాలతో పాటు రెండు మండలాల్లో ప్రజలు వీధిలో తిరగాలంటే భయపడే పరిస్థితి తలెత్తుతోంది. ఎక్కడపడితే అక్కడ కుక్కలు గుంపులుగా తిరుగుతూ పాదచారులను, వాహన చోదకులను వెంటపడి గాయపరుస్తున్నాయి. ముఖ్యంగా మాంసం, చేపల దుకాణాల వద్ద ఉంటూ దుకాణదారులు పడేసే అవశేషాలకోసం తిరుగుతూ స్థానికులను గాయపరుస్తున్నాయి.

అధికారులు నియంత్రించాలి

పంచాయతీ రాజ్ చట్టం సెక్షన్ 92 ప్రకారం గ్రామల్లో ప్రజలకు వీధి కుక్కలను నియంత్రించాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. ముందుగానే కుక్కలను పట్టుకుని పశువైద్యాధికారితో యాంటీ రాబీస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ) వేయించాలి. కుక్కల సంఖ్య పెరగకుండా వాటికి కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించాలి. పెంపుడు కుక్కల యజమానులు పంచాయతీలో లైసెన్సు తీసుకుని, పన్ను కూడా చెల్లించాల్సి ఉంది. కానీ పంచాయతీ పాలకులు మాత్రం కుక్కల సమస్య తమది కాదన్నట్టు వ్యవహరిస్తున్నారు.

ఏడాదిలో మూడు వేల మంది బాధితులు

నేడు ప్రతి ప్రభుత్వాస్పత్రిలో కుక్కకాటు మందు అందుబాటులో ఉంది. ఏడాది వ్యవధిలో పెద్దాపురం మండలంలో శునక బాధితుల సంఖ్య వెయ్యి దాటిందంటే వాటి తీవ్రత అర్థమవుతుంది. గత జూన్ నుంచి ఇప్పటి వరకు (జూన్ నెల వరకు) నియోజకవర్గంలో 3,074 మంది కుక్క కాట్లకు చికిత్స పొందారు. అధికారిక లెక్కలు ఇలా ఉండగా ప్రైవేటు ఆస్పత్రుల్లో చికిత్స పొందేవారి సంఖ్య కూడా ఎక్కువే.

ఏడాదిన్నర కాలంలో కేసులు

పెద్దాపురం సీహెచ్‌సీ	1,062
సామర్లకోట సీహెచ్‌సీ	1,291
పులిమేరు పీహెచ్‌సీ	275
కాండ్రకోట పీహెచ్‌సీ	255
వేట్లపాలెం పీహెచ్‌సీ	191
మొత్తం	3,074

అధికారులు చొరవ తీసుకోవాలి



వీధి కుక్కలతో అల్లాడిపోతున్నాం. నా కుమారుని వయస్సు రెండేళ్లు దాటింది. చేతి మీద కుక్క కరవడంతో పెద్దాపురం సీహెచ్‌సీలో చికిత్స వేయించుకున్నాం. గ్రామాల్లో శునకాలను నియంత్రించాలి.

– నానేపల్లి అమ్మాజీ, గృహిణి, చంద్రమాంపల్లి, పెద్దాపురం మండలం,

రెండు వేల పెంపుడు కుక్కలకు వ్యాక్సినేషన్



నియోజకవర్గ పరిధిలోని దాదాపు రెండు వేల పెంపుడు కుక్కలకి ఏఆర్‌వి వ్యాక్సినేషన్ వేశాము. ఈ ఏడాదికి సుమారు 500 ఏఆర్‌వి డోసులు పెద్దాపురం ఆసుపత్రిలో పెంపుడు కుక్కలకు వేయడానికి సిద్ధంగా ఉంచాం. కుక్కల నియంత్రణకు చేయాల్సిన కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ఇక్కడ అందుబాటులో లేవు.

– డాక్టర్ కె.రాకేష్, పశు వైద్యాధికారి, ఆర్‌బీ పట్నం, పెద్దాపురం మండలం

భౌతిక్క దాడులు



కొత్తపల్లిలో విచ్చలవిడిగా సంచరిస్తున్న కుక్కలు

కొత్తపల్లి: నియోజకవర్గంలో కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. శునకాలు పగలూ, రాత్రి పగలు తేడా లేకుండా విచ్చలవిడిగా సంచరిస్తూ వృద్ధులు, చిన్నపిల్లలపై దాడులు చేస్తున్నారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు తీవ్ర భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. పాదచారులతో పాటు ద్విచక్రవాహనాల వెంట పడి దాడి చేస్తుండడంతో ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, వృద్ధులకు సైతం కుక్కలు పిక్కలు లాగేస్తున్నాయి. ప్రధాన కూడళ్లు, మాసం దుకాణాలు, చేపల మార్కెట్లలో కుక్కలు ఎక్కువగా సంచరిస్తున్నాయి. అక్కడ చేపల కొనుగోలుదారులపై దాడులు చేస్తున్నాయి. వాహనాలపై వెళ్లే వారిని సైతం వదలకుండా తరిమి కరుస్తున్నాయి. కుక్కల దాడి నుంచి రక్షించుకునే ప్రయత్నంలో వాహన దారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మండలంలో ఉప్పాడ, కొత్తపల్లి, అమీనాబాదు, మూలపేట, కొండెవరం, కొమరగిరి, నాగులాపల్లి తదితర గ్రామాల్లో కుక్కల దాడిలో గాయపడే రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మండలంలోని కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో గత నెలరోజులుగా సుమారు 300 కుక్కకాటు కేసులు నమోదైనట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు కుక్క కాటుకు గురై వైద్యానికి వస్తున్నారని డాక్టర్లు తెలిపారు.

కుక్కలు నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి

వీధి కుక్కల నిర్మూలనకు అధికారులు చర్యలు తీసుకోవాలి. రాత్రి, పగలు తేడా లేకుండా కుక్కలు గ్రామాల్లో సంచరిస్తున్నాయి. ఇంటి నుంచి బయటకు రావాలంటేనే భయపడే పరిస్థితి ఏర్పడింది. పిల్లలను బయటకు పంపాలంటే భయపడుతున్నాం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలి.

– చింతలపూడి వెంకటరమణ, కొత్తపల్లి